
పుష్కరాల రేవులో సోమవారం తెల్లవారుజామున భక్తుల రద్దీ

హరహర మహాదేవ

- శివాలయాలకు పోటెత్తిన భక్తులు
- తొలి కార్తీక సోమవారం ప్రత్యేక పూజలు

రాజమహేంద్రవరం సిటీ: కార్తిక మాసంలోని తొలి సోమవారం సందర్భంగా నగరంలోని శివాలయాలకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. పుష్కరాల రేవులో తెల్లవారుజాము నుంచే రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి పుణ్యస్నానాలు ఆచరించారు. నదీలో దీపాలను వదిలారు. సమీపంలోని ఆలయాల్లో పూజలు నిర్వహించారు. బ్రాహ్మణులకు దీప దానాలు చేశారు.

రాజమహేంద్రవరం రూరల్: శివ కేశవులకు ప్రీతికరమైన కార్తికమాసంలో తొలి సోమవారం సందర్భంగా వేకువజాము నుంచే శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. టి.నగర్‌లోని బాలా త్రిపుర సుందరి, అన్నపూర్ణా సమేత విశ్వేశ్వర స్వామి, రైల్వే క్వార్టర్స్‌లోని రామాలయం ఆవరణలో ఉన్న వెంకట రామలింగేశ్వరస్వామి, బొమ్మూరులోని గౌరీచంద్ర మౌళీశ్వరస్వామి ఆలయాలతో పాటు మండలంలోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఆయా ఆలయాల కమిటీలు ఏర్పాట్లు చేశాయి.


రావిచెట్టు వద్ద పూజలు నిర్వహిస్తున్న భక్తులు


దీపదానం చేస్తున్న మహిళలు


వెంకట రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో స్వామికి హారతులు


నందీశ్వరునికి పూజలు చేస్తున్న మహిళలు


పూజలు నిర్వహిస్తున్న మహిళలు

క్లుప్తంగా

జాతీయ యోగా పోటీలకు కార్తిక్

ప్రకాశం నగర్: రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ ఇంగ్లిష్ మీడియం ప్రభుత్వ పాఠశాల విద్యార్థి కర్రి కార్తిక్ రామచంద్రారెడ్డి జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యాడని ప్రధానోపాధ్యాయుడు ఎంవీఎం సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. నెల్లూరులో ఇటీవల జరిగిన 68వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్‌లో యోగా విభాగంలో ట్రెడిషనల్, ఆర్టిస్ట్ విభాగాలలో కార్తిక్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచాడు. ఆ రెండు విభాగాల్లోనూ ప్రథమ స్థానంలో నిలవడమే కాకుండా ఓవరాల్ ఫర్ఫార్మెన్స్‌తో మొదటి బహుమతిని గెలుచుకున్నాడన్నారు. దీంతో మహారాష్ట్రలో జాతీయ స్థాయి స్కూల్ గేమ్ పోటీలలో పాల్గొనే అర్హత సాధించాడని తెలిపారు. ఈ సందర్భంగా యోగా గురువు కేఎస్‌వీ శ్రీధర్ రెడ్డి, కార్తిక్‌లను అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారన్నారు.

దివాన్ చెరువులో చోరీ

రాజమహేంద్రవరం రూరల్: ఇంటిలోని 16 గ్రాముల బంగారం, నగదును దొంగలు చోరీ చేశారు. వివరాల్లోకి వెళితే.. దివాన్ చెరువులోని సాయి దుర్గానగర్‌కు చెందిన మనోజ్ సూర్యారెడ్డి కోయంబత్తూర్ జేకే ఫుడ్స్‌లో మార్కెటింగ్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. ఆయన ఉద్యోగం నిమిత్తం గత నెల 23వ తేదీన క్యాంపునకు వెళ్లారు. ఆయన భార్య మంజుల పుట్టింటికి వెళ్లింది. తిరిగి ఈ నెల 3వ తేదీన ఇంటికి రాగా తలుపులు తీసి ఉన్నాయి. లోపలకు వెళ్లి చూడగా బీరువాలోని 16 గ్రాముల విలువైన బంగారు వస్తువులు, కొంత నగదు కనిపించ లేదు. ఈ మేరకు మనోజ్ సూర్యారెడ్డి సోమవారం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై ప్రియా కుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విజేతలకు అభినందనలు

ప్రకాశం నగర్: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఇటీవల జరిగిన ఇంటర్ కాలేజియేట్ టోర్నమెంట్, యూనివర్సిటీ సెలక్షన్స్‌లో ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల క్రాస్ కంట్రీ మెన్ అండ్ విమెన్ టీమ్ మొదటి స్థానం సాధించింది. ఈ సందర్భంగా విజేతలను ప్రిన్సిపాల్ రామచంద్ర సోమవారం అభినందించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడలపై ఆసక్తి చూపుతున్నారని, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

మహ్మద్ సుభానీ దర్గాలో గంధోత్సవం


గంధోత్సవంలో పాల్గొన్న చందన నాగేశ్వర్

ధవళేశ్వరం: గ్రామంలోని ఎర్రకొండ వద్ద ఉన్న మహ్మద్ సుభానీ దర్గాలో జరిగిన గంధోత్సవంలో రాష్ట్ర పచ్చదనం, సుందరీకరణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ చందన నాగేశ్వర్ పాల్గొన్నారు. ఎండీ హమీద్ బాషా వంశస్తుల ఆధ్వర్యంలో గంధోత్సవాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా గంధాన్ని ఊరేగింపుగా దర్గా దగ్గరకు తీసుకువచ్చి ప్రార్థనలు చేశారు. మదర్సా విద్యార్థులు ఖురాన్ పఠించారు. చందన నాగేశ్వర్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ హయాంలో ఈ ప్రాంతంలో రూ.10 లక్షలతో ఖబరిస్తాన్‌ను నిర్మించామన్నారు. మదర్సా స్కూల్ విద్యార్థులకు నెలకు రూ.10 వేలు ఇస్తానని హామీ ఇచ్చారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వక్ఫ్ బోర్డు డైరెక్టర్ కరీమ్ బాషా, ఎండీ బాషా, ఎండీ రబ్బానీ, ఎండీ అజీమ్, ఎస్‌కే ముస్తఫా, ఎండీ నవాజ్ పాల్గొన్నారు.

7, 8 తేదీల్లో సదస్సు

కంబాలచెరువు: 'జీవ–ఆధారిత పర్యావరణం కోసం సుస్థిరమైన భూభాగంపై' అనే అంశంపై స్థానిక ఆర్ట్స్ కళాశాలలో ఈ నెల 7, 8 తేదీలలో అంతర్జాతీయ సదస్సును నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆ సదస్సు బ్రోచర్‌ను ఆవిష్కరించారు.

ఆకుల వీర్రాజు పరామర్శ

కడియం: డీసీసీబీ మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజు సోమవారం మండలంలోని పలువురిని పరామర్శించారు. మండలంలోని కడియపులంకలో ఇటీవల నాగిరెడ్డి మంగ, కె.సత్యనారాయణ మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులను ఆకుల వీర్రాజు పరామర్శించారు. ఆయన వెంట బోడపాటి సత్యనారాయణ, తిరుమలశెట్టి శ్రీనివాస్, ఆరేటి వెంకట్రావు, కురుమళ్ల ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

ఇంటి నిర్మాణాలు వేగవంతం చేయాలి

సీటీఆర్ఐ: ఇంటి నిర్మాణాలను వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు ఆదేశించారు. హౌసింగ్, ఉపాధి హామీ, పీజీఆర్ఎస్, ఖరీఫ్ ధాన్యం సేకరణ తదితర అంశాలపై సోమవారం సాయంత్రం డీఆర్వో టి.శ్రీరామచంద్రమూర్తితో కలిసి ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ రెండో దశ వంద రోజుల కార్యక్రమంలో భాగంగా 4,875 ఇళ్లకు 786 పూర్తి చేశారన్నారు. మరో 1,688 రూఫ్ లెవెల్, 3187 రూఫ్ కంప్లీట్ స్థాయిలో ఉన్నాయన్నారు. ఎన్టీఆర్ భరోసా పథకం కింద 20,227 ఇళ్లకు 20,225 మంజూరు చేయడం జరిగిందన్నారు.

అపార్ డేటాను సత్వరమే పూర్తి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న డీఐ దిలీప్ కుమార్

కంబాలచెరువు: అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు యూడైస్ డేటా అప్‌డేట్ చేసి, విద్యార్థులకు సత్వరమే అపార్ నంబర్లను జెనరేట్ చేయాలని అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్ ఆదేశించారు. ఈ మేరకు సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యూడైస్ డేటాను అత్యంత జాగ్రత్తగా పూర్తి చేయాలన్నారు. విద్యార్థి పుట్టిన తేదీ, పేరు తదితర వివరాలు ఆధార్ కార్డులోనూ, పాఠశాల రికార్డులోనూ ఒకేలా ఉండాలన్నారు. ఆధారు కార్డ్ డేటా, స్కూల్ డేటాలో మార్పులు ఉంటే ఎస్ఓ త్రీ ఫారం పూర్తి చేసి, తగు ఆధారాలతో ఆఫీస్‌కి అందజేస్తే మార్పు చేస్తారన్నారు. ఆన్‌లైన్ వర్కుకు అత్యంత ప్రాధాన్యమిచ్చి త్వరగా పూర్తి చేయాలన్నారు. నవంబర్ 14వ తేదీన మెగా పేరెంట్ మీటింగ్ ఏర్పాటు చేయాలని, అందుకు సంబంధించిన విధి విధానాలను వివరించారు. సమావేశంలో అర్బన్ ఎంఈవో–2 రమారజనీ, ఎస్‌కేవీటీ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎంవీఎం సుబ్రహ్మణ్యం, సీఆర్ఎంటీలు జయంతి శాస్త్రి, జె.శ్రీనివాసరావు, పబ్బినీడి ప్రసాద్, ఇందిర, నాగలక్ష్మి, కుమారి, కోటేశ్వరి పాల్గొన్నారు.

అక్కినకు అభినందనలు


ముని కోటేశ్వరరావును అభినందిస్తున్న పాడుగు శ్రీను

రాజమహేంద్రవరం సిటీ: తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యుడిగా నియమితులైన నగర ప్రముఖుడు, పారిశ్రామికవేత్త అక్కిన ముని కోటేశ్వరరావును బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి, విశ్వ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర యువజన అధ్యక్షుడు పాడుగు శ్రీను (గాడాల శ్రీను) సోమ వారం అభినందించారు. శ్రీవారి ఆశీసులతో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు.

ఉపాధి హామీ గ్రామసభ

కడియం: మండలంలోని జేగురుపాడులో సర్పంచ్ యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ అధ్యక్షతన ఉపాధి హామీ పనుల గుర్తింపు కోసం సోమవారం గ్రామ సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత ఆర్థిక సంవత్సరంలో 19,606 పని దినాలతో జిల్లాలోనే రెండోస్థానంలో నిలిచిందన్నారు. ఈసారి అంతకంటే ఎక్కువ పనిదినాలు కూలీలకు కల్పించి ప్రథమ స్థానం దక్కించుకునేలా చూడాలన్నారు. మాజీ ఎంపీటీసీ సభ్యులు నాగిరెడ్డి శివాజీ, పాలపర్తి ప్రకాష్ కుమార్, ఫిషర్ మెన్ సొసైటీ అధ్యక్షులు సాక కిరణ్ కుమార్, బల్ల అన్నవరం. ఈసీ ఇన్‌చార్జి ఏపీవో ఎం.రమణ మూర్తి పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓట్ల నమోదు వేగవంతం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ చైతన్యబాబు

రాజమహేంద్రవరం రూరల్: ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి ఓట్ల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని రూరల్ తహసీల్దార్ పీవీవీ జయ సూర్యకుమార్ అన్నారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులు, వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లకు సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదు ప్రక్రియ ఈ నెల ఆరో తేదీతో ముగుస్తుందన్నారు. 2021 నవంబర్ ఒకటో తేదీ నాటికి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులన్నారు. డిప్యూటీ తహశీల్దార్ కె.చైతన్యబాబు మాట్లాడుతూ అధిక సంఖ్యలో పట్టభద్రులు ఓట్లను నమోదు చేసుకునేలా సహకరించాలన్నారు. సీపీఎం నాయకులు కర్రి రామకృష్ణ, పడాల రామకృష్ణ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఓటరు నమోదు గడువు పెంచాలని కోరారు. సమావేశంలో మండల టీడీపీ అధ్యక్షుడు మత్సేటి ప్రసాద్, బీజేపీ రూరల్ అసెంబ్లీ కో కన్వీనర్ యానాపు ఏసు, జీఎంఆర్ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, డైట్ సీనియర్ లెక్చరర్ కేవీ సూర్యనారాయణ, యూటీఎఫ్ నాయకుడు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గౌతమీ గ్రంథాలయ అభివృద్ధికి శంకుస్థాపన


మెయిన్ రోడ్డులో విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడుతున్న సిటీ ఎమ్మెల్యే శ్రీనివాస్

సీటీఆర్ఐ: గౌతమీ గ్రంథాలయంలో రూ.30 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు సోమవారం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జెండా పంజా రోడ్డులో ఆధునీకరించిన మద్దూరి అన్నపూర్ణయ్య పార్కును స్థానిక నాయకులతో కలిసి ఆయన ప్రారంభించారు. మెయిన్ రోడ్డులో ట్రాఫిక్ సమస్య, ఎలక్ట్రికల్ ట్రాన్స్‌ఫార్మర్ సమస్యల పరిష్కారం కోసం చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు, పోలీసులు, ఏపీఈపీడీసీఎల్ అధికారులతో కలిసి మెయిన్ రోడ్డును పరిశీలించారు. అక్కడి ట్రాన్స్‌ఫార్మర్ ఎత్తును పెంచాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు ప్రణాళికలను తయారు చేయాలని పోలీసులను కోరారు.

ఒకటిన కాపు వన సమారాధన


సమావేశంలో మాట్లాడుతున్న రామినీడు మురళి

సీటీఆర్ఐ: రాజమహేంద్రవరం కాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న చెరుకూరి గార్డెన్స్‌లో డిసెంబర్ ఒకటిన కాపు వన సమారాధన జరగనుంది. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో సంఘ ప్రతినిధులు ఈ విషయం తెలిపారు. సంఘ గౌరవ అధ్యక్షుడు రామినీడు మురళీ మాట్లాడుతూ వనసమారాధనకు నగరంలోని 50 డివిజన్ల నుంచి సంఘీయులు హాజరు కావాలని కోరారు. దీనిపై ఇప్పటికే అన్ని డివిజన్లలో విస్తృతంగా సభ్యత్వ నమోదు జరుగుతోందని, దానికి సంబంధించిన వివరాలను వన సమారాధనలో వెల్లడిస్తామన్నారు. ఆ రోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు కుటుంబాలతో కలిసి ఉత్సాహంగా గడిపేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. సంఘంలోని ప్రముఖ డాక్టర్లు, వ్యాపారులు, ఇతర వర్గాలకు చెందిన వారి వివరాలతో రూపొందించిన కేలండర్ ఆవిష్కరణ జరుగుతుందన్నారు. 15 సంవత్సరాలుగా కాపు సంక్షేమ సంఘం ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు వెనుకబడిన కాపు సామాజిక వర్గాల విద్యార్థులకు ఆర్థిక సహాయం అందజేస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో గౌరవ సలహాదారు దొండపాటి సత్యం బాబు, అధ్యక్షుడు అల్లూరి శేషునారాయణ, కాపు మహిళ అధ్యక్షురాలు మాలే విజయలక్ష్మి, చింతా వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి


మహిళామార్టు ను పరిశీలిస్తున్న కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు నగర పాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ అన్నారు. కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ మీ కోసం కార్యక్రమంలో ప్రజల నుంచి 12 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అర్జీలను నిబంధనల మేరకు సత్వరమే పరిష్కరిస్తామన్నారు. పారిశుద్ధ్య నిర్వహణ, మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు ఆదేశించారు. కాగా.. డంపింగ్ యార్డు దుర్గంధం, డ్రైనేజీ సమస్య, వీధిలైట్లు వెలగక పోవడం, కుళాయి నీరు రాకపోవడం తదితర వాటిపై పలువురు అర్జీలు సమర్పించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ హెల్త్ ఆఫీసర్ వినూత్న, ఎస్ఈ జి.పాండురంగారావు, సిటీ ప్లానర్ జి.కోటయ్య పాల్గొన్నారు.

మహిళా మార్టు సందర్శన

రాజమహేంద్రవరం సిటీ: మహిళా మార్టులో విక్రయాలను ప్రోత్సహించేందుకు ప్రచారం చేయాలని మెప్మా సిబ్బందికి కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయం సమీపంలోని షాపింగు కాంప్లెక్స్ పైభాగంలో ఏర్పాటు చేసిన మహిళా మార్టును సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళల ఆర్థిక స్వావలంబన కోసం మహిళా మార్టును ప్రారంభించామన్నారు. ఆర్ఎంసీ సేవక్ యాప్, ఆర్ఎంసీ వెబ్‌సైట్, సోషల్ మీడియాలో మహిళా మార్టు గురించి ప్రచారం చేయాలన్నారు. మహిళా సంఘాల సభ్యులందరికీ తెలియజేసి, వారందరూ మహిళా మార్టులో సరకులు కొనుగోలు చేసేలా చూడాలని ఆదేశించారు. ఆయన వెంట సీఎంఎం రామలక్ష్మి, సాయి, కమ్యూనిటీ ఆర్గనైజర్లు విజయకుమారి, గోవర్ధన రెడ్డి, రాజ్యలక్ష్మి, ఉమ పాల్గొన్నారు.

నర్సరీ కూలీ కస్తూరి కుటుంబాన్ని ఆదుకుంటాం


ఆర్థిక సాయం అందజేస్తున్న పోలరాజు, సభ్యులు

కడియం: నర్సరీ కూలీ కస్తూరి కుటుంబాన్ని అన్నివిధాలా ఆదుకుంటామని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. సోమవారం బుర్రిలంకలోని ఆమె స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. రూ.లక్ష ఆర్థిక సాయాన్ని వారికి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ కస్తూరిని అతి దారుణంగా అత్యాచారం చేసి, హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షిస్తామన్నారు. మానసిక వికలాంగురాలైన ఆమె కుమార్తెకు వికలాంగ సర్టిఫికెట్‌తో పాటు రూ.15 వేల పింఛన్, గ్రాడ్యుయేట్ చదువుతున్న కుమారుడికి చదువు పూర్తవ్వగానే ఏదైనా ఉద్యోగం, అదే గ్రామంలో నివాస స్థలం అందజేస్తామని హామీ ఇచ్చారు. ప్రతి నర్సరీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. గంజాయిని పూర్తిస్థాయిలో ఈ ప్రాంతంలో అరికట్టేందుకు నర్సరీ రైతులతో పాటు ప్రజలు కూడా పోలీసులకు సహకారం అందించాలన్నారు. గంజాయి తాగిన వారిని గుర్తించేందుకు బ్రీత్ ఎనలైజర్ వంటి ప్రత్యేకమైన సాంకేతికతను రూపొందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఆయన వెంట డీఎస్పీ భవ్య కిషోర్, కడియం పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఎ.వెంకటేశ్వరరావు, టీడీపీ రాష్ట్ర రైతు ఉపాధ్యక్షుడు మార్గాని సత్యనారాయణ, గెడ్డం శివ తదితరులు ఉన్నారు.

ఆర్థిక సాయం అందజేత

కడియం: నర్సరీ కూలీ రౌతు కస్తూరి కుటుంబానికి సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లు పోలరాజు ఆధ్వర్యంలో కార్యవర్గ సభ్యులు రూ.50 వేలు ఆర్థిక సాయాన్ని సోమవారం అందజేశారు. ఇటువంటి ఘటనలు జరగడం దారుణమన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా సత్యసాయిబాబా పాటల భజన


కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ గూడూరి శ్రీనివాస్, రాధిక దంపతులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): మాజీ కార్పొరేటర్ చోడిశెట్టి సత్యవాణి స్వగృహంలో కార్తిక మాసం సందర్భంగా సత్యసాయిబాబా 100 పాటల భజన నిర్వహించారు. సత్యసాయి బాబా భజన బృందం, భక్త బృందం ఆధ్వర్యంలో వైభవంగా ఈ కార్యక్రమం జరిగింది. వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్, వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి గూడూరి రాధిక ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. భక్త బృందంతో కలిసి గూడూరి రాధిక భక్తి గీతాలను ఆలపించారు. కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు బులుసు వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. అనంతరం 42 ఏళ్లుగా సత్యసాయిబాబా విద్యానగర్ సమితికి సేవలు అందిస్తున్న కేవీవీ సత్యనారాయణ దంపతులను చోడిశెట్టి సత్యవాణి, సమితి పెద్దలు సత్కరించారు. సత్యసాయి గురుకుల విద్యాసంస్థ కరస్పాండెంట్ శ్యామ్ సుందర్, జిల్లా అధ్యక్షుడు బులుసు వెంకటేశ్వర్లు సంస్థ కార్యక్రమాలను వివరించారు. ఏపీ గాండ్ల, తెలుకుల కార్పొరేషన్ మాజీ చైర్ పర్సన్ సంకిన భవానీ ప్రియ పాల్గొన్నారు.

సినిమాలు



శ్యామల	: బఘీర
సూర్యమినీ	: జనక అయితే గనక
సూర్యప్యాలెస్	: లక్కీ భాస్కర్
శివజ్యోతి	: క
అనుశ్రీ	: క
స్వామి	: అమరన్
అశోక	: లక్కీ భాస్కర్
రాజా	: అమరన్
రంభ	: భూల్‌భులాయియా–3
ఊర్వశి	: అమరన్
మేనక	: విశ్వం
కుమారి	: దేవర
అప్సర నామవరం	: లక్కీ భాస్కర్
వీఎస్.మహల్ ధవళేశ్వరం	: లక్కీ భాస్కర్, క
మురళీకృష్ణ కడియం	: లక్కీ భాస్కర్
వెంకటసూర్య	: లక్కీ భాస్కర్

ఆ పోలీసు అధికారి నుంచి ప్రాణహాని


మాట్లాడుతున్న వాసంశెట్టి గంగాధరరావు

సీటీఆర్ఐ: గతంలో బొమ్మూరులో పనిచేసి, ఇప్పుడు పెనుగొండలో సీఐగా విధులు నిర్వహిస్తున్న రాయుడు విజయ కుమార్‌తో తనకు ప్రాణహాని ఉందని మాజీ కార్పొరేటర్, సీనియర్ కార్మిక నాయకుడు వాసంశెట్టి గంగాధర్ అన్నారు. స్థానిక వై.జంక్షన్‌లోని ఆనం రోటరీ హాల్లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఒక కేసు విషయంపై హైకోర్టులో రిట్ పిటిషన్ వేశారని, దాన్ని ఉపసంహరించుకోవాలని ఫోన్ల ద్వారా గుర్తు తెలియని వ్యక్తులు బెదిరిస్తున్నారన్నారు. తనను అనుసరిస్తున్న ఒక వ్యక్తి విషయంపై ఫొటోతో పాటు త్రీటౌన్‌లో ఫిర్యాదు చేశానని, కానీ ఇంత వరకూ అతడిపై చర్యలు తీసుకోలేదన్నారు. సదరు సీఐతో పాటు మరో ముగ్గురు ఇటీవల విజయవాడలో జరిగిన దసరా మహోత్సవాల్లో విధుల నిర్వహణకు వెళ్లి పేకాట ఆడారని, ఈ వీడియో తనకు రావడంతో దాన్ని సామాజిక మాధ్యమంలో, ఆ తరువాత కొన్ని మీడియా సంస్థలకు అందజేస్తే వారు ప్రసారం చేశారన్నారు. అయినా అతడిపై చర్యలు తీసుకోవడానికి పోలీసు శాఖ వెనుకాడుతోందని విమర్శించారు. రెండ్రోజుల కితం జిల్లా అడిషనల్ ఎస్పీ తనను పిలిపించి తాను చేసిన ఫిర్యాదుపై స్టేట్ మెంట్ రికార్డు చేసుకున్నారని, కానీ ఇంతవరకు ఎటువంటి చర్యలు లేవన్నారు. తక్షణం అతడిని విధుల నుంచి సస్పెండ్ చేసి తనకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తన ఇంట్లోనే ఆమరణ నిరాహార దీక్ష చేస్తానని వెల్లడించారు.